## పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 16: మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులకు తత్కాల్ స్కీమ్ ద్వారా ఫీజు చెల్లించుటకు గడువు పెంచినట్లు డీఈవో రాధాకిషన్ గురువారం ప్రకటనలో తెలిపారు. రూ.వెయ్యి ఆపరాధ రుసుంతో ఈ నెల 22వ తేదీలోగా చెల్లించాలన్నారు.

## సెల్ టవర్ ఎక్కి రైతు హల్‌చల్



సెల్ టవర్ ఎక్కిన రైతు నారాయణ

నిజాంపేట, జనవరి 16: కౌలు డబ్బులు చెల్లించాలంటూ రైతు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన నిజాంపేటలో గురువారం జరిగింది. చల్మెడకు చెందిన బొమ్మెన నారాయణ నాలుగేండ్ల క్రితం నిజాంపేటలోని రైతు శ్రీనివాస్‌రెడ్డి వద్ద కౌలు చేశాడు. కౌలు డబ్బులు ఇవ్వకపోవడంతో నాలుగు రోజుల క్రితం నారాయణ, శ్రీనివాస్‌రెడ్డికి జరిగిన గొడువలో శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు నారాయణపై కేసు నమోదు చేయించారు. కౌలు డబ్బులు ఇవ్వకపోగా.. తనపై కేసు నమోదు కావడంతో నారాయణ మనస్తాపానికి గురై నిజాంపేటలోని సెల్ టవర్ ఎక్కాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నారాయణకు నచ్చజెప్పడంతో కిందకి దిగాడు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామాయంపేట, జనవరి 16: మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రశాంత్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి అప్పులు తీర్చే మార్గం లేక వారం రోజుల క్రితం ఉరేసుకుని మేడ్చల్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు 30 మంది కలిసి రూ.21 వేల నగదును బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు.

## రిలే నిరాహార దీక్షలో మహిళలు



నిజాంపేట, జనవరి 16: బీటీ రోడ్డు కోసం నిజాంపేట ప్రధాన రోడ్డుపై నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో నస్కల్ గ్రామ మహిళలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రోడ్డు మార్గం సరిగా లేని కారణంగా బస్సు రాకపోవడంతో పిల్లల చదువులకు, అత్యవసర పనులకు ఇబ్బంది కలుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో హేమలత, లక్ష్మి, లింగమ్మ, నాగరాణి, కిష్టవ్వ, రేణుక తదితరులు ఉన్నారు.

## కార్మికులకు వేతనాలివ్వాలి



రామాయంపేట, జనవరి 16: మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెలించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. గురువారం రామాయంపేటలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 16: కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగానే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే కులగణన పూర్తి చేసిందని, బీసీ జనాభా 55 శాతం ఉన్నట్లు తెలిసిందన్నారు.

## అక్కన్నపేటలో యువకుల ర్యాలీ



అక్కన్నపేటలో ర్యాలీ చేస్తున్న యువత

రామాయంపేట, జనవరి 16: అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా యువకులు బైకు ర్యాలీ నిర్వహించారు. యువత రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేశారు. గ్రామ చావిడి వద్ద రాముడి చిత్రపటం, పాదుకలను ఉంచి పూజచేసి మొక్కులు చెల్లించుకున్నారు.

# కొత్త పింఛన్లకు మోక్షం లభించేనా?

- 'చేయూత' కోసం ఎదురుచూపులు!
- ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రాని ప్రకటన
- ప్రతి నెలా వందల మంది దరఖాస్తు
- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

మెదక్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఆసరా పింఛన్ల కోసం కొత్తగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ హయాంలో ఆసరా పథకం పేరును కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతగా మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు పింఛన్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు రాకపోవడంతో ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా వందల మంది పింఛన్ల కోసం దరఖాస్తులు చేస్తున్నారు.

### జిల్లాలో 1,13,933 మంది పింఛన్‌దారులు

జిల్లాలో 1,13,933 మంది పింఛన్ పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా రూ.25.53 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఇందులో వృద్ధులు 38,338 మంది ఉండగా వారికి రూ.8 కోట్లు, వితంతువులు 45276 మందికి రూ.9 కోట్ల 56 లక్షలు, దివ్యాంగులు 8332 మందికి రూ.3 కోట్ల 39 లక్షలు పంపిణీ చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేసే విధానం అమల్లో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఆ ఊసే లేకుండా పోయింది. ప్రతి నెలా అర్హులైన పింఛన్‌దారులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. సంబంధిత విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు విచారణ చేసి, అర్జీలను పక్కన పెడుతున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియను ఆపివేయడంతో దరఖాస్తుదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఆగస్టు ఒకటి నుంచి నూతన పింఛన్ ప్రక్రియ చేపడుతామని చెప్పినా.. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రజాపాలనలో వచ్చిన వేలాది దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

### రూ.4 వేల పింఛన్ కోసం ఎదురుచూపులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.2వేల పింఛన్‌ను రూ.4వేలు చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.4వేల పింఛన్ వస్తుందని ఎంతో ఆనంద పడ్డ వృద్ధులకు చివరకు నిరాశే కలుగుతున్నది. ఏడాది కాలంగా ప్రభుత్వం పెంచుతామన్న పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమకు బాసటగా నిలుస్తుందని అనుకున్న ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేశామోనని ఆవేదన చెందుతున్నారు. ప్రతి నెలా ఠంచన్‌గా రావాల్సిన పింఛన్లు రెండు, మూడు నెలలకోసారి వస్తున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రూ.4వేల పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

### పంచాయతీ కార్యాలయంలో పింఛన్ అందించాలి

చిన్నశంకరంపేట, జనవరి 16: ప్రతి పంచాయతీ కార్యాలయంలో ఆసరా పింఛన్లు అందించాలని చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల ఆసరా పింఛన్‌దారులు కోరుతున్నారు. పోస్టాఫీసులో ఆసరా ఫించన్ ఇవ్వడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ తీసుకోవాలంటే మూడు, నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తున్నదని వాపోతున్నారు. మూడు, నాలుగు గ్రామాలకు చెందిన పింఛన్‌దారులకు ఒకే దగ్గర పింఛన్ ఇవ్వడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదంటున్నారు. గవ్వలపల్లి పోస్టాఫీసులో గవ్వలపల్లితో పాటు గవ్వలపల్లి గిరిజన తండా, కొర్విపల్లి, అంబాజిపేట పంచాయతీలకు చెందిన పింఛన్‌దారులు సుమారు 600పైగా ఉంటారు. అంతమందికి ఒకే చోట ఇవ్వడంతో వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. అంబాజిపేట కొర్విపల్లి, గవ్వలపల్లి గిరిజన తండావాసులు ఆసరా ఫించన్ తీసుకోవాలంటే తప్పనిసరిగా రెండు, మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిందే. దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితశాఖ అధికారులు ప్రతి పంచాయతీలోనే ఆసరా పింఛన్ అందించేలా చూడాలని కోరుతున్నారు.

### ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు



కొత్త పింఛన్లకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. ఆ తర్వాతే పింఛన్లు మంజూర య్యే అవకాశం ఉంది. జిల్లా వ్యా ప్తంగా ఇప్పటికే పింఛన్ల కోసం దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 1,13,933 మంది పింఛన్ పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా రూ. 25.53 కోట్లు పంపిణీ చేస్తున్నాం.

**- శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీవో పీడీ, మెదక్**



గవ్వలపల్లి పోస్టాఫీస్ వద్ద పింఛన్ కోసం బారులుదీరిన వృద్ధులు, దివ్యాంగులు

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



రామాయంపేటలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



చిన్నశంకరంపేట: సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

- 26న నాలుగు పథకాల అమలుకు సర్వేలు ప్రారంభం
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- రామాయంపేట, కాట్రియాల గ్రామాల్లో సర్వే తీరు పరిశీలన

రామాయంపేట, జనవరి 16: రామాయంపేటతో బాటు కాట్రియాల గ్రామాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పర్యటించారు. మండలంలోని కాట్రియాల గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనితీరును పరిశీలించారు. అనంతరం రామాయంపేటకు చేరుకుని పట్టణంలోని వివిధ వార్డుల బాట పట్టి ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈనెల 26న నాలుగు పథకాలు ప్రారంభిస్తున్నదని, ఆ పథకాలకు రెవెన్యూ పురపాలిక సిబ్బంది ద్వారా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగు పథకాల్లో ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రతా కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఆహార భద్రతను కాట్రియాల గ్రామంలో స్వయంగా ఇంటికి వెళ్లి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట రామాయంపేట ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజినీకుమారి, ఎంపీడీవో షాజులుద్దీన్, కమిషనర్ దేవేందర్, ఏవో రాజ్‌నారాయణ ఉన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమగ్ర సర్వేలను పారదర్శకంగా చేయాలని, ఎక్కడ పొరపాట్లు జరిగినా చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

### అర్హులందరికీ రేషన్‌కార్డులు

చిలిపిచెడ్, జనవరి 16: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డు అందజేస్తామని జిల్లా రేషన్ సరఫరా అధికారి సురేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఫైజాబాద్‌లో ఇంటింటి రేషన్ కార్డు సర్వేను పరిశీలించారు. రేషన్ కార్డులో తప్పొప్పులు లేకుండా, ప్రతిఒక్కరి కార్డును పరిశీలించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఆనంద్, గ్రామ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

### అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్

నిజాంపేట, జనవరి 16: మండలంలోని చల్మెడ, నందిగామ, వెంకటాపూర్(కె) గ్రామాల్లో మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గురువారం రైతుభరోసాకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ (వ్యవసాయ యోగ్యం కాని భూముల) వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మండల ఏవో సోమలింగారెడ్డి, ఆర్ఐలు ప్రీతి, ఇమాద్, సీనియర్ అసిస్టెంట్ రమేశ్, ఏఈవోలు శ్రీలత, మౌనిక, రమ్య తదితరులు ఉన్నారు.



సర్వే రికార్డులను చూపిస్తున్న ఎంపీడీవో, ప్రత్యేక అధికారి

### నిర్మాణాలకు రైతుభరోసా వర్తించదు

నర్సాపూర్, జనవరి 16: సర్వే నంబర్‌లో నిర్మాణాలు చేపడితే వాటి విస్తీర్ణానికి రైతుభరోసా వర్తించదని ఆర్ఐ సిద్దిరాములు పేర్కొన్నారు. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో ఆర్ఐ సిద్దిరాములు ఆధ్వర్యంలో రైతుభరోసా పథకానికి సంబంధించిన వెరిఫికేషన్ సర్వే చేపట్టారు. సర్వే నెంబర్‌లో ఫంక్షన్ హాల్, ఇండ్లు, ఫాంహౌస్, కంపెనీలు తదితర వాటిని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ అభిలాష్, ఏఈవో, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

### సజావుగా సర్వే ప్రక్రియ నిర్వహించాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 16: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక సర్వేను ఆర్డీవో రమాదేవి పర్యవేక్షించారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న నిరుపేదలకు గుర్తించాలని, భూములు, ఆదాయం వంటి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఆర్ఐ లక్ష్మణ్, వ్యవసాయధికారులు ఉన్నారు.

### పథకాల అమలుకు సర్వే

వెల్దుర్తి, జనవరి 16: ప్రభుత్వ పథకాల అమలుకు అధికారులు గ్రామాల్లో సర్వేలు చేపట్టారు. రేషన్ కార్డుల జారీ కోసం ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో విఘ్నేశ్వర్ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. రైతుబంధు పథకం కోసం సాగు భూముల వివరాలను తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు.

### ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

చేగుంట, జనవరి 16: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలని నార్సింగి ఎంపీడీవో ఆనంద్, తహసీల్దార్ కరీం పేర్కొన్నారు. నార్సింగిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన విధివిధానాలను గ్రామ స్థాయి అధికారులకు వివరించారు. అనంతరం వల్లూర్, శేరిపల్లి గ్రామాల్లో సర్వేలు చేశారు. 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ అనూషరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సాగుకు యోగ్యం కాని భూముల సర్వే

రేగోడ్, జనవరి 16: సాగుకు యోగ్యం కాని భూముల సర్వేను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నరేశ్ గురువారం తెలిపారు. మండలంలోని ఆర్ఇటిక్యాలలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేశామన్నారు.ఆయన వెంట ఏవో జావీద్ ఉన్నారు.

### రైతు భరోసా కోసం సాగుభూముల సర్వే

శివ్వంపేట, జనవరి 16: రైతుభరోసా అందించేందుకు సాగు భూములతో పాటు సాగుకు యోగ్యం కాని భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. మండలంలోని పెద్దగొట్టిముక్ల, అల్లీపూర్, ఏదుల్లాపూర్, శభాశ్‌పల్లి, మగ్దుంపూర్ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వ్యవసాయానికి యోగ్యం కానీ భూములను పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశాలతో సర్వే చేస్తున్నామని, పూర్తి సర్వే చేసి అధికారులకు నివేదిస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషన్, ఏఈవో వెన్నెల, సిబ్బంది ఉన్నారు.

### వ్యవసాయేతర భూముల సర్వే

కౌడిపల్లి, జనవరి 16: రైతు భరోసా కోసం వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు అధికారులు గ్రామస్థాయిలో పర్యటించారు. తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో లింగంపల్లి, కన్నారం, ముట్రాజ్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించి వ్యవసాయానికి పనికి రాని భూములను గుర్తించే సర్వే చేపట్టారు. డిపూటీ ఎమ్మార్వో, ఆర్ఐ లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీహరి, సర్వేయర్ మొగులయ్య పాల్గొన్నారు.



రేగోడ్: సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేశ్



కౌడిపల్లి: లింగంపల్లిలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు



నర్సాపూర్: రాంచంద్రాపూర్‌లో రైతుభరోసా సర్వే నిర్వహిస్తున్న ఆర్ఐ సిద్దిరాములు



శివ్వంపేట: పెద్దగొట్టిముక్లలో సర్వేచేస్తున్న అధికారులు

## వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

రామాయంపేట, జనవరి 16: రామాయంపేటలోని గోదాసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆమె స్వగృహానికి వెళ్లి ఫిబ్రవరి రెండో వారంలో జరిగే వేంకటేశ్వర స్వామి పుష్కర వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు, ఆలయ కమిటీ పాలక మండలి సభ్యులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య

**- మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి**

మెదక్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : ఈడీ ఆఫీస్ వద్ద కేటీఆర్‌కు సంఘీభావం తెలపడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం ఇది నూటికి నూరు శాతం కక్ష సాధింపు చర్య అని పేర్కొన్నారు. దీన్ని మేధావులు, ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలన్నారు.

## మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



ఇబ్రహీంపూర్‌లో నాటు కోళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

చేగుంట, జనవరి 16: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని వడియారంలో బట్టల తయారీ, ఇబ్రహీంపూర్‌లో నాటు కోళ్ల పెంపకం, మహిళా రైతులు సాగు చేస్తున్న కూరగాయల పందిరిని గురువారం పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది సక్రమంగా చెల్లించి, ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పీడీ సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, సీసీలు రామస్వామి, స్వామి, అంజ్యానాయక్, మమత, శ్వేత, బంరందేవి, సిద్దిరాములు తదితరులున్నారు.


## ఎరువులు అందుబాటులో ఉండాలి



ఫర్టిలైజర్‌లో మందులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి వినయ్

చిలిపిచెడ్, జనవరి 16: ఎరువులు, పురుగు మందులు ప్రతి రైతుకూ అందుబాటులో ఉం చాలని, ప్రతి షాపులో స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి వినయ్ అన్నారు. గురువారం చిలిపిచెడ్ ఆగ్రో సేవా కేంద్రం, అంతారం, చండూర్ చౌరస్తాలోని వెంకటేశ్వర ఫర్టిలైజరు షాపును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మకూడదన్నారు. అనుమతి లేని విత్తనాలు, పురుగు మందులు అమ్మితే పీడీ యాక్ట్ చట్టం కింద చర్యలు తీసుకుంటామన్నారు. రైతు కొన్న చేసిన ప్రతి వస్తువుకు రసీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో రాజశేఖర్‌గౌడ్, ఏఈవో భూపాల్, ఫర్టిలైజరు యజమానులు, రైతులు ఉన్నారు.

## వనదుర్గామాతను దర్శించుకున్న అదనపు ఎస్పీ



పాపన్నపేట, జనవరి 16: ఏడుపాయల వనదుర్గామాతను అదనపు ఎస్పీ మహేందర్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నిజాంపేట, జనవరి 16: మండలంలోని నార్లపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో 2006-07లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. 17 ఏండ్ల తర్వాత ఒకే చోట తమ ఉపాధ్యాయులతో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహరావు, రవీందర్, నారత్వం, దేవేందర్, శ్రీనివాస్, సంజీవ్, శ్రీనివాస్, వెంకటస్వామి, పూర్వ విద్యార్థులు రాజేందర్, మల్లేశం, కరుణాకర్, వేణు, లక్ష్మారెడ్డి, నరేశ్ తదితరులు ఉన్నారు.

## యువత క్రీడాస్ఫూర్తితో పోటీపడాలి



చిలిపిచెడ్, జనవరి 16: యువత క్రీడాస్ఫూర్తితో పోటీపడాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగారం గ్రామంలో జీపీఎల్-3 నిర్వహించారు. ఈ టోర్నీలో ప్రథమ, ద్వితీయ విజేతలకు రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.